దశాలవారీగా పైప్‌లైన్ వ్యవస్థల ఆధునికీకరణ



గోల్నాకలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం గోల్నాక డివిజన్ శాంతినగర్, హనుమాన్ ఆలయ సమీపంలో రూ. 12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలం చెల్లిన పైప్‌లైన్ వ్యవస్థను దశాల వారీగా తొలగించి నియోజకవర్గంలో ఆధునిక పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటుకు చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం స్థానికంగా పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి



శృతి ఓజాను అభినందిస్తున్న ఫిజికల్ డైరెక్టర్లు

కాచిగూడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ శృతి ఓజా ఐఏఎస్ అన్నారు. కమిషనర్‌గా నూతంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.బాలరాజ్, ప్రధానకార్యదర్శి డాక్టర్ బి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం ఆమెను కలిసి అభినందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఫిజికల్ డైరెక్టర్లు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌లకు జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ల ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.జయప్రద బాయి, హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పర్వతాలు గౌడ్, ప్రధాన కార్యదర్శి జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, హర్షవర్ధన్ సంయుక్త ఆధ్వర్యంలో రంగానగర్‌లో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీలు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినయ్ స్వామిచే అయ్యప్ప మహాపడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున హాజరై పూజలు నిర్వహించి అయ్యప్ప భక్తిగీతాలు ఆలపించారు. బీఆర్‌ఎస్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ఉమాకాంత్, శంకర్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్, యాదయ్య, పోచయ్య పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత సావిత్రీబాయి పూలే



ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బాలోత్సవ కమిటీ నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ... సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలేలు శతాబ్దాల క్రితమే మూఢాచారాలు, కట్టుబాట్లు, మహిళల పట్ల వివక్షతలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, జాతీయ నాయకురాళ్లు టి.జ్యోతి, కె.ఎన్.ఆశాలత, ఇందిర, ఎం.స్వర్ణలత, టి.రమాదేవి, రజిత తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యం కోసం కృషి చేయాలి...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సావిత్రీబాయి పూలే స్ఫూర్తిగా సమాజ చైతన్యం కోసం మహిళలు ఉద్యమించాలని టీపీఎస్‌కే అధ్యక్షుడు, తెలంగాణ బాలోత్సవం కమిటీ నేత భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా సైన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు టి.రమేష్, బాలోత్సవం కమిటీ కార్యదర్శి ఎస్.సోమయ్య, శోభారాణి, జి.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ భవన్‌లో...

కాచిగూడ: సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళలందరికీ ఆదర్శం కావాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో అఖిల భారత పద్మశాలీ సంఘం మహిళా విభాగ్ అధ్యక్షురాలు వనం దుశ్యంతల ఆధ్వర్యంలో సావితీబాయి జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు సోమ కవిత, దీపిక బిల్లా, బాసాని పద్మ, అట్టిపాముల స్రవంతి, బోగ నీరజ, భువన, సంతోషి, శివమ్మ, జయ, పుట్ట పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన రవాణా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న బీపీటీఎంఎం ప్రతినిధులు

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన రవాణా చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో బీపీటీఎంఎం రాణిగంజ్ మినీ గూడ్స్ వెహికిల్ యూనియన్ సభ్యులు బుధవారం ధర్నా నిర్వహించారు. బీపీటీఎంఎం ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్, తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ ఉపాధ్యక్షుడు హబీబ్ మాట్లాడుతూ... కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన రవాణా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన కమర్షియల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌ను 50శాతం తగ్గించాలన్నారు. ఒక్ నేషన్ ఒన్ యాక్ట్ విధానాన్ని అమలు చేయాలని, వాహన డ్రైవర్ల కోసం ఆస్పత్రులు రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీయే అధికారుల బలవంతపు వసూళ్ళను నిరోధించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీపీటీఎంఎం నేషనల్ అధ్యక్షుడు ఆషిమ్ దత్, శంకర్, శ్రీనివాస్ ముదిరాజ్, జహంగీర్, మనోజ్, పెంటయ్య, నందకిశోర్, కిషన్, రాములు, మహేశ్, రంగ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి 3 రోజుల జైలు శిక్ష



కార్తీక్

చిక్కడపల్లి: పెట్టీ కేసులో ఓ యువకుడికి న్యాయమూర్తి 3 రోజుల జైలు శిక్ష విధించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సమాచారం మేరకు... బాగ్‌లింగంపల్లి పాలమూరు బస్తీకి చెందిన కె.కార్తీక్(26) ఓ పెట్టీ కేసులో నిందితుడు. నాంపల్లి 5వ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి ముందు కార్తీక్‌ను ప్రవేశపెట్టగా మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

అసౌకర్యాల సుడిలో అంగన్‌వాడీ కేంద్రాలు

- గందరగోళంగా కేంద్రాల నిర్వహణ
- కనీస వసతులు లేక తప్పని ఇబ్బందులు
- చిరిగిన చాపలు, అరకొర కుర్చీలు, వంట సామగ్రి...



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

కవాడిగూడ: పేద కుటుంబంలోని ఆరు సంవత్సరాలోపు చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు సమతుల్య పౌష్టికాహారాన్ని అందించడం అంగన్ వాడీ కేంద్రాల ముఖ్య ఉద్దేశం. కొన్నేళ్లుగా వీటి నిర్వహణ గందరగోళంగా మారింది. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బండ మైసమ్మ-1, బండమైసమ్మ-2 అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. చిరిగిపోయిన చాపలు, అరకొర కుర్చీలు, వంట సామగ్రి కనిపిస్తాయి. వస్తువులను భద్రపరిచేందుకు కనీసం అల్మారాలు, బీరువాలు లేవు. ఫలితంగా అంగన్‌వాడీ వస్తువులు చోరీకి గురైన సందర్భాలు ఉన్నాయి. పిల్లలు కూర్చోడానికి రెండు చాపలు, ఏడాదిన్నర క్రితం ఇచ్చారని, అవి వినియోగించే స్థితిలో లేవు.

కొరవడిన భద్రత...

అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్న కమ్యూనిటీ హాల్‌లో స్థానికుల పుట్టిన రోజులు, రాజకీయ పార్టీలకు చెందిన కార్యక్రమాలు, ఇతరత్రా చిన్నచిన్న వేడుకలకు వినాయక చవితి తదితర ఉత్సవాల సందర్భాల్లో కూడా కమ్యూనిటీ హాల్‌ను వినియోగిస్తుంటారు. దీంతో ఒకవైపు అంగన్‌వాడీ కేంద్రం, మరో వైపు ఇటీవల ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమంతో అంగన్‌వాడీ చిన్నారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నెలలకు సరిపడా స్టాక్ వస్తే భద్ర పర్చడం కష్టంగా ఉంటుందని, సొంత భవనం కేటాయించాలని మహిళలు కోరుతున్నారు.

గిన్నెలు లేక ఎన్ని ఇబ్బందులో...

ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో 30 మంది చిన్నారులు నమోదై ఉన్నారు. నిత్యం కనీసం 20 మంది కేంద్రానికి హాజరవుతుంటారు. గర్భిణులు, నర్సింగ్ మదర్‌లు కూడా వస్తుంటారు. నిత్యం వీరికి పౌష్టికాహారాన్ని కేంద్రంలోని సహాయకురాలు (అంగన్‌వాడీ ఆయా) వండి పెడుతుంటారు. ప్రభుత్వం గ్యాస్ స్టవ్, సిలిండర్ ఇచ్చి గిన్నెలు మాత్రం ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్ తన ఇంటి నుంచి గిన్నెలు తీసుకువచ్చి వినియోగిస్తున్నారు.



బండమైసమ్మ నగర్ కమ్యూనిటీ హాల్



అంగన్‌వాడీ కేంద్రం బయటే ఉంచిన కోడిగుడ్లు

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు



ముషీరాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కవితను కలిసిన వారిలో ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, సాయి చాణిక్య రెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా తెలంగాణ గౌడ కల్లు సంఘాల సమన్వయ కమిటీ నేతలు రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్‌లు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

దీపాదాస్ మున్షీకి సన్మానం



చిక్కడపల్లి: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నేత దీపాదాస్ మున్షీని ఆ పార్టీ సీనియర్ నేత కెన్నడీ కృపారావు, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్‌లు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ



కాచిగూడ: అడ్వకేట్ జేఏసీ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ వి. సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. సౌత్ ఇండియా అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్, మైనార్టీ అడ్వకేట్ అధ్యక్షుడు మహ్మద్ వాహేద్ ఆలీఖాన్, నవీన్ రాజ్, విజయుడు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎం.వి.రమణ, ఐయిలి వెంకన్నగౌడ్, ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, గుమ్మడిరాజు నరేష్, డాక్టర్ బండి సాయన్న, బూర మల్సూర్‌గౌడ్, ముద్దగౌని రాంమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు అసంపూర్ణమే...



మహిళలను సత్కరిస్తున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చట్టసభల్లో బీసీ మహిళలకు సబ్ కోటా లేని మహిళా బిల్లు అసంపూర్ణమే అని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ అధ్యక్షురాలు బండారు పద్మావతి, గోషిక స్వప్న, మీడియా కన్వీనర్ మారెపల్లి లక్ష్మణ్ నేత, దాసు బలరామ్, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: ఆడపిల్ల చదువుకోసం నిరంతరం పాటుపడిన సావిత్రీబాయి పూలే గొప్ప చైతన్యమూర్తి అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. సావితరీబాయిపూలే జయంతి సందర్భంగా బుధవారం కార్పొరేటర్ కార్యాలయంలో నిర్వహించిన పలువురు మహిళలకు ఆమె చీరలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, పండారి నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, ప్రకాష్, ఎం.డి.మహమూద్ పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో కేంద్రం పతిపాదనలు దారుణం: సీఐటీయూ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లోక్‌సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహితలోని హిట్ అండ్ రన్‌లకు సంబంధించిన 104 సెక్షన్(1, 2)లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డ్రైవర్లందరు ఉద్యమిస్తారని హెచ్చరించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్స్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... డ్రైవర్ లేకుండా సమాజ అవసరాలు తీరాలంటే సాధ్యమయ్యే పని కాదన్నారు. గ్రామాల నుంచి ఆహార ఉత్పత్తులు, పట్టణాల నుంచి సరుకులను దేశం నలుమూలలకు చేరుతున్నాయంటే డ్రైవర్ అందించే సేవలేనని అన్నారు. ఫెడరేషన్ నాయకులు కె.అజయ్‌బాబు, కుమారస్వామి, ఎం.సత్యనారాయణ, జి.రాములు, మోహన్, ఎం.డి.ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో సజావుగా 'ప్రజాపాలన'

అంబర్‌పేట: ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా చేపట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. బుధవారం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కేంద్రాలను ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని సిబ్బందికి సూచించారు.

డీహెచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



డీహెచ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న టీఎంహెచ్‌ఈయూ ప్రతినిధి బృందం

నల్లకుంట: వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (డీహెచ్) డాక్టర్ రవీందర్ నాయక్ జన్మదిన వేడుకలు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ తదితరులు డాక్టర్ రవీందర్ నాయక్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, సోషల్ మీడియా అధ్యక్షుడు గోపీకృష్ణ, నరసింహ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు తమ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

నల్లకుంట: ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించి పునర్జన్మ ప్రసాదించే వైద్యులు, వైద్య సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ సూచించారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ అధ్వర్యంలో బుధవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలోని యూనియన్ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ కేక్ కట్‌చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ డాక్టర్స్ కొండల్ రెడ్డి, అనిల్ కుమార్, డాక్టర్ శైలజ, హరిత, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్ దాసు, ఆఫీస్ సూపరింటెండెంట్ యధిలాల్, టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రతినిధులు రాజ్‌కుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

కాచిగూడ: ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా మెడికవర్ హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలు బాగున్నాయని ఆయన ప్రశంసించారు. బీపీ, షుగర్, బాడీ మాస్ ఇండెక్స్, ఈసీజీ తదితర వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించున్నారు. వివిధ విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య సేవలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ వినోద్, బ్రాంచ్ హెడ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను అందుబాటులోకి తేవాలి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ పేద మధ్య తరగతి కుటుంబాల వారు శుభకార్యాలు నిర్వహించేందుకు వీలుగా అందుబాటులో ఉంచాలని కోరుతూ జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ కాలనీ సొసైటీ కాలనీ సభ్యులు జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్యకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్న డాక్టర్ యాదయ్యకు వారు వినతిపత్రం సమర్పించి సమస్యలు ఏకరువు పెట్టి చూపించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు నర్మెట్ల మల్లేష్ గుండు జగదీశ్‌బాబు, రత్నసాయించంద్ మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్‌లో బతుకమ్మ చీరలు ఉంచారని, ఇతరత్రా వస్తువులతో నింపివేశారని తెలిపారు. కమ్యూనిటీ హాల్ ఆవరణలో చెత్తాచెదారాలు పేరుకుపోయామని శుభకార్యాలు నిర్వహించుకోవడానికి స్థానికులకు మున్సిపల్ సిబ్బంది ఎలాంటి అవకాశం కల్పించడం లేదన్నారు. స్పందించిన ఆయన ఈ సమస్య పరిష్కారానికి తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానన్నారు. సాయిలు, నర్సింగ్‌రావు, సురేందర్, మల్లేష్, కృష్ణ, కమర్‌బాయి, బాబురావు, సాయికీర్త్ (బాబ్జీ) పాల్గొన్నారు.

నియామకం



సత్యంకు నియామక పత్రాన్ని అందజేస్తున్న భాస్కర్‌రాజ్

చిక్కడపల్లి: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్(సోషల్ మీడియా)గా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన దోసేటి సత్యం నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ బుధవారం సత్యంకు నియామకపత్రం అందజేశారు. సత్యం మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా శాయశక్తులా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సంజయ్‌గనాటే, నందుబాయ్, ప్యారసాని, వెంకటేష్, రవీందర్‌గౌడ్, మారుతి పాల్గొన్నారు.

అదృశ్యమైన తల్లీపిల్లలు భర్తకు అప్పగింత



చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన తల్లీ ముగ్గురు పిల్లల ఆచూకీ లభించింది. వారి ఆచూకీని కనుగొని వారిని తీసుకువచ్చి పీఎస్‌లో బుధవారం భర్త ఎస్.సాయికృష్ణకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సమాచారం మేరకు... గత నెల 6న చిక్కడపల్లి సంజయ్‌నగర్‌కు చెందిన సాయికృష్ణ భార్య ఎస్.సునీత, పిల్లలు చైత్ర, త్రిలోచన్, మానిష్‌లు తప్పిపోతే వారి గురించి వెతికి ఆచూకీ లభించనందున గత నెల 29న చిక్కడపల్లి పీఎస్‌లో సాయికృష్ణ ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కోటేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సునీత కాల్ లిస్ట్ ఆధారంగా ఆమె మెహిదీపట్నం సమీపంలోని ఓ చిన్న గ్రామంలో ఇండ్లలో పనిచేసుకుంటుండగా పోలీసులు ఆమె ఆచూకీ కనుగొని ఆమెను ముగ్గురు పిల్లలను తీసుకొచ్చారు.